క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

బి.కొత్తకోట: బురకాయలకోట 132 విద్యుత్ కేంద్రంలో మరమ్మతులు, జాతీయ రహదారిపై విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని ఏడీ గోవిందరెడ్డి శుక్రవారం తెలిపారు. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, దీన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో హోమాలు చేస్తున్న భక్తులు

కేవీపల్లె : మండలంలోని ఎంపీపల్లె పంచాయతీ ఒంటిల్లులో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయం ప్రాంగణంలో వివిధ రకాల హోమాలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన మిట్స్ విద్యార్థులు



క్రీడా పోటీల్లో సాధించిన షీల్డ్‌లతో మిట్స్ విద్యార్థులు

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు కడప కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా జరిగిన ట్రోఫీ–25లో వివిధ క్రీడా పోటీలలో పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. మహిళల బాస్కెట్ బాల్, త్రోబాల్, కబడ్డీ, టెన్నికాయిట్ పోటీలలో మొదటి స్థానంలో విజేతగా నిలిచారన్నారు. బాడ్మింటన్‌లో పురుషుల జట్టు మొదటి స్థానం సాధించిందన్నారు. చెస్‌లో మహిళలు రన్నర్‌గా నిలిచారన్నారు. షీల్డ్ లను, సర్టిఫికెట్లను అందుకున్నారు. వీరిని కరస్పాండెంట్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్ చౌదరి అభినందించారు.

అన్నదానం

మదనపల్లె : వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె మాజీ సర్పంచ్ బోరెడ్డి రఘునాథరెడ్డి జ్ఞాపకార్థం మదనపల్లె కూరపర్తి సాయి చైతన్య ట్రస్ట్, వాల్మీకిపురం చౌడేశ్వరిదేవి వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బోరెడ్డి రఘునాథరెడ్డి కుమారులు దామోదర్‌రెడ్డి, మంజునాథరెడ్డి, మనవడు శంకర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబసమస్యలతో వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. వలసపల్లె పంచాయతీ బొగ్గిటివారిపల్లెకు చెందిన రాజశేఖర్ భార్య సుమతి (21) కుటుంబ సమస్యలతో ఇంటి వద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జ్ఞానాంబిక విద్యాసంస్థ అధినేత గురుప్రసాద్ తదితరులు

మదనపల్లె సిటీ: ఏబీవీపీ ఆధ్వర్యంలో వేసవి సెలవులు సందర్భంగా మదనపల్లెశాఖ ఆధ్వర్యంలో మే 1 తేదీ నుంచి విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించనున్నారు. బోధన తరగతుల కరపత్రాన్ని శుక్రవారం జ్ఞానాంబిక విద్యాసంస్థల అధినేత రాటకొండ గురుప్రసాద్ ఆవిష్కరించారు. స్థానిక మదనపల్లె జూనియర్ కాలేజీలో మే 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఉచిత బోధన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు సాయిప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి కిషోర్‌కుమార్, మోహన్‌రాజు, సాయిహితేష్ కుమార్, వెంకటేష్, సాయిజగదీష్ పాల్గొన్నారు.

మహాభారత యజ్ఞం

వీరబల్లి: మండలంలోని మట్లి పంచాయతీలోని మాండవ్య నది ఒడ్డున గల కోదండ రామాలయం వద్ద మహా భారత యజ్ఞాన్ని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. తొలి రోజున సీతారామలక్ష్మి హరికథ వినిపించారు. అనంతరం ఎస్ఐను గ్రామస్తులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఎస్ఐ మాట్లాడుతూ పదమూడు రోజులపాటు జరిగే మహా భారత యజ్ఞం కార్యక్రమాన్ని ఎలాంటి ఆటంకాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కార్యనిర్వాహకులపై ఉందని తెలిపారు.

పని చేస్తూ.. నేర్చుకో..

- ఉపాధికి హామీ ఇచ్చే ఒకేషనల్ కోర్సులు
- తక్కువ సమయంలో ఉద్యోగ అవకాశాలు

స్వల్ప వ్యవధిలో తక్కువ ఖర్చుతో స్థిరమైన ఉపాధి పొందాలని ఆశించేవారు. టెన్త్ తర్వాత వృత్తి విద్యా (ఒకేషనల్) కోర్సులపై దృష్టి సారించవచ్చు. కోర్సు పూర్తయిన వెంటనే అదనపు శిక్షణ లేకుండా కొలువు లేదా ఉపాధిలో కుదరవచ్చు. మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సుల్లో 40 శాతం థియరీ, 60 శాతం ప్రాక్టికల్ ద్వారా నేర్చుకుంటారు. తెలుసుకోవడం అంటే పని ద్వారా నేర్చుకోవడం. వీటిని ఇంటర్మీయట్‌లో భాగంగానే ఒకేషనల్ పేరుతో ప్రత్యేకంగా అందిస్తున్నారు.

మదనపల్లె సిటీ: పదో తరగతి పరీక్షలు మంగళవారం విడుదల కానున్నాయి. మరి ఇంటర్ ఎక్కడ చేరాలి. ఏఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఎప్పటి నుంచో వస్తున్న ఎంపీసీ, బైపీసీ, సీఈసీ తదితర కోర్సులతో పాటు కొత్తగా ఏవైనా కోర్సులు ఉన్నాయా.. స్థానికంగా అందుబాటులో ఉన్న కొత్త కోర్సుల వివరాలు తెలుసుకుందాం పదండి..



ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ

మదనపల్లె పట్టణం ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో జనరల్ కోర్సులతో పాటు ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కాలేజీలో ప్రతి ఏడాది మంచి ఫలితాలు సాధిస్తున్నారు. జిల్లా స్థాయితో పాటు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారు. ప్రధానంగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు ఉండగా ఈ సారి కొత్తగా ఎంబైపీసీ కోర్సు అందుబాటులోకి తెచ్చారు.

ఒకేషనల్ కోర్సులు ఇవే..

నర్సింగ్, సెరికల్చర్, అకౌంట్ అండ్ టాక్సేషన్, కన్‌స్ట్రక్షన్ ఇంజినీరింగ్ టెక్నాలజీ, మెకానికల్ అండ్ ఆటోమొబైల్ టెక్నాలజీ, గార్మెంట్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

విద్యార్థులు తోటి స్నేహితులు చెప్పారనో.. పక్కింటి కుర్రాడు అన్నాడనో.. తల్లిదండ్రులకు ఇష్టమైన కోర్సుల్లో చేరాలనుకుంటారు. చాలా మంది విద్యార్థి అభిరుచికి అనుగుణంగా కోర్సులు తీసుకుని చదవాలని నిపుణులు సూచిస్తున్నారు. కొందరు వైవిధ్యభరిత కోర్సులు తీసుకుని మధ్యలోనే చదవకుండా కళాశాల మానేస్తుంటారు. దాని వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. దీని వల్ల సమయంతో పాటు ధనం కూడా వృధా అవుతుందని విద్యావేత్తలు చెబుతున్నారు. చేరే ముందే ఆయా కోర్సుల గురించి తెలుసుకోవాలని సూచిస్తున్నారు

అడ్మిషన్లు ప్రారంభం



ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్ల ప్రారంభమయ్యాయి. పదో తరగతి చదివిన విద్యార్థులు తమకు నచ్చిన కోర్సుల్లో చేరవచ్చు. కాలేజీలో ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి.

–బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, మదనపల్లె

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



నాయకులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎవరూ అధైర్యపడొద్దని, అండగా ఉంటానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారనాథరెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం మండలంలోని కన్నెమడుగు పంచాయతీలో జరిగిన దండుమారెమ్మ జాతరకు హాజరయ్యారు. కన్నెమడుగు మాజీ సర్పంచులు మిత్రశేఖర్‌రెడ్డి, శ్యామలమ్మ కుమారులు రామకృష్ణారెడ్డి (పెద్దబాబు), రవిశంకర్‌రెడ్డి (చినబాబు) స్వగృహంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిని శాలువతో సత్కరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అందరూ ఐక్యమత్యంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ వైఫలాల్యలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచు శివమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మహేష్, నాయకులు రెడ్డప్పరెడ్డి, ఎరుకల్‌రెడ్డి, రామశంకర్‌రెడ్డి, శివారెడ్డి, రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్లు తొలగించిన అధికారులు

లబోదిబోమంటున్న రైతులు



వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కేబుళ్లు కత్తిరించిన అధికారులు

గుర్రంకొండ: వ్యవసాయ బోరుమోటార్లకు సంబంధించిన బిల్లులు చెల్లించలేదని ట్రాన్స్‌కో అధికారులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తొలగించిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. ఈ కనెక్షన్ తొలగింపుతో సదరు రైతుతో పాటు పలువురు బిల్లు చెల్లించిన రైతులకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గుర్రంకొండ పట్టణానికి సమీపంలోని తూముకుంట ప్రాంతంలో రైతులు వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఓ రైతు విద్యుత్ బిల్లు చెల్లించలేదు. ఈ సాకుతో ట్రాన్స్‌కో అధికారులు రైతుకు సమాచారం ఇవ్వకుండా ట్రాన్స్‌ఫార్మర్‌లో విద్యుత్ కనెక్షన్ తొలగించారు. అయితే 11 కేవీ కేబుల్ తొలగించడంతో బిల్లుకట్టని రైతుతో పాటు మరో ఆరుమంది బిల్లు చెల్లించిన రైతులకు కుడా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడురోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరించాలని ట్రాన్స్‌కో అధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఏఈ మౌసీన్‌ను వివరణ కోరగా తాను సెలవులో ఉన్నానని, తనకు ఈ విషయం తెలియదన్నారు. నిబంధనల మేరకు బిల్లు చెల్లించకపోతే కనెక్షన్లు తొలగిస్తామన్నారు.

అటవీశాఖ అధికారుల వైఫల్యంతోనే చిరుత మృతి



మాట్లాడుతున్న పీఎల్.నరసింహులు

మదనపల్లె : మదనపల్లి మండలం పొన్నూటిపాలెం గ్రామంలో అటవీశాఖ అధికారుల వైఫల్యంతోనే చిరుత మృతి చెందిందని జిల్లా కార్యదర్శి పీఎల్. నరసింహులు అన్నారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ చిరుత ఉచ్చులో చిక్కుకోవడం గమనించిన గ్రామస్తులు ఉదయం 8:00 గంటలకు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి వచ్చినప్పటికీ, మధ్యాహ్నం 1:30 వరకు చిరుతను కాపాడడంలో పూర్తిగా వైపల్యం చెందారన్నారు. అధికారుల చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి రైతులుపై కేసు నమోదు చేశారని మండిపడ్డారు. చిరుత మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని, అరెస్టు చేసిన రైతుల్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, మురళి,మాధవ్ పాల్గొన్నారు.

ఫారెస్ట్ బీట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

మండలంలోని పొన్నూటిపాళెం వద్ద ఉచ్చులో చిరుతపులి చిక్కుకుని, ప్రాణాలు విడిచిన ఘటనలో ఆ ప్రాంత ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పై చర్యలు తీసుకోవాలని, కేసులు పెట్టిన అమాయక రైతులను విడిచిపెట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అడవిలో వేటగాళ్లు ఉచ్చులు బిగుస్తుంటే... క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎందుకు గుర్తించలేకపోయారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫారెస్ట్ సిబ్బందిపై, ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పెద్దతిప్పసముద్రం: స్థానిక మండల కేంద్రంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. బెంగళూరులోని వైదేహి సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి వారి సహకారంతో జరిగే ఈ వైద్య శిబిరంలో క్యాన్సర్, గుండె, ఎముకలు, నరాల వైద్య నిపుణులు పాల్గొంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బయో గ్యాస్ ప్లాంట్‌కు భూములివ్వండి

బి.కొత్తకోట: కంప్రెషర్డ్ బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు రావాలని తహసీల్దార్ మొహమ్మద్ అజారుద్దీన్ శుక్రవారం కోరారు. మండలంలో ఎక్కడైనా వ్యవసాయానికి ఉపయోగంలో లేని భూములు లీజుకు ఇచ్చేందుకు సహకరిస్తే ఎకరాకు రూ.30 వేలు లీజు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రెండో ఏటా నుంచి ప్రతి ఏటా ఐదుశాతం పెంచుకుంటూ అద్దె ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ లీజు ఒప్పందం 30 ఏళ్ల పాటు ఉంటుందని తెలిపారు. ఒకేచోట 50 ఎకరాల భూమి అవసరమని తెలిపారు. రైతులు సహకరించి భూములు లీజుకు ఇస్తే బయో గ్యాస్ ప్లాంటును ఏర్పాటు చేసేందుకు సంస్థ ముందుకు వస్తుందని తెలిపారు. భూములు ఇవ్వదలిచే రైతులు తమను సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే ఆకేపాటి శివదీక్ష

రాజంపేట రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తన సతీమణి అమర జ్యోతమ్మతో కలిసి శుక్రవారం శివదీక్ష చేపట్టారు. మండలంలోని ఆకేపాటి ఎస్టేట్‌లోని శివాలయం వద్ద శుక్రవారం వేకువ జామున ఎమ్మెల్యే ఆకేపాటి, జ్యోతమ్మ దంపతులు భక్తి శ్రద్దలతో పూజలు జరిపారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను పూజారి శర్మ ఆశ్వీరదించారు.

అనుమతులు తప్పనిసరి

సుండుపల్లె: సానిపాయి జాతర సందర్భంగా సుండుపల్లె మండలంలోని గ్రామాల ప్రజలు చాందినీబండ్లు కట్టేందుకు పోలీసుల అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు ఓ ప్రకటనలో కోరారు. అనుమతులు లేకుండా చాందినీబండి కడితే ఆర్గనైజర్స్‌పైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీతారాముల కల్యాణం

పుల్లంపేట: పుల్లంపేటలోని రామాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌ను పుర వీదులలో మేళతాళాల నడుమ ఊరేగించారు.

వర్గీకరణతో ఎస్సీలకు సమన్యాయం



నిమ్మనపల్లె: మాట్లాడుతున్న నరేంద్రబాబు



పీలేరు రూరల్ : మాట్లాడుతున్న రామకృష్ణమాదిగ

నిమ్మనపల్లె: వర్గీకరణతో ఎస్సీలలోని అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతుందని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) జాతీయ నాయకులు నరేంద్రబాబు అన్నారు. శుక్రవారం నిమ్మనపల్లి ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి మల్లేశ్వర రావు తో కలిసి, బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణపై దశాబ్దాలుగా పోరాటం చేసి సానుకూల ఫలితం సాధించిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం అనంతరం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ అమలు చేయడానికి కార్యచరణను సిద్ధం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎమ్మెస్ఎఫ్, ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సంబరాలు

పీలేరు రూరల్ : ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణమాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి నాయకులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మంద కృష్ణమాదిగ చేపట్టిన కృషి నేటికి ఫలించిందని హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు పురం రామూర్తి, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటరమణ, చలపతి, శ్రీనివాసులు, బాలకృష్ణ, రాజేష్, నరసింహ, గురుప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకం

ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకమని ఎంఎస్‌పీ నాయకులు ఎస్. సుధాకర్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద పలువురు ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు తలనీలాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముల్లంగి చంద్రయ్య, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



వాల్మీకిపురంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు, సిబ్బంది



పీలేరు : కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక అధికారులు

కలికిరి(వాల్మీకిపురం): అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం అగ్నిమాపక అధికారి జే.బాబయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వాల్మీకిపురం పట్టణ పరిధిలోని ఓ పెట్రోలు బంకులో సిబ్బందితో పాటు స్థానికులకు అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫైర్స్, ఇతర అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమో ద్వారా వివరించారు. అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, రాజగోపాల్ నాయక్, మురళీమోహన్‌నాయక్, కిరణ్‌బాబు, వెంకటరమణ, రవి, ఇమ్రాన్ బాషా, బలరాం నాయక్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

పీలేరు : పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల వద్ద అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి మస్తాన్ అన్నారు. శుక్రవారం గ్యాస్ గోడౌన్లు, పెట్రోల్ బంకుల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్, ఆయిల్, ఎలక్ట్రికల్ ఫైర్ జరిగినపుడు ఏ విధంగా మంటలు అదుపు చేయాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగినపుడు 101 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సిబ్బంది నాగిరెడ్డి, హేమాద్రిరెడ్డి, చలపతి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, వెంకటేష్, రెడ్డిశేఖర్, మహబూబ్‌బాష, చైతన్యకుమార్, జాకీర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ సమావేశం

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఆదివారం ఏపీ ప్రైవేటు హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్‌కు చెందిన నిర్వాహకులైన వైద్యులు 600 మంది వరకు హాజరవుతారని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వైద్యులతో సమావేశాలు ఉంటాయని తెలిపారు. కంటిన్యూయేషన్ మెడికల్ ఎడ్యుకేషన్ అనే కార్యక్రమం నిర్వహించి, వైద్యపరమైన 15 అంశాలపై వైద్య నిపుణుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలివస్తుండటంతో హార్సిలీహిల్స్‌పై అతిథి గృహాలన్నీ నిండిపోయాయి.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



ముస్లింలతో నిసార్‌అహ్మద్

నిమ్మనపల్లె : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ సైదాపేట సకీనా మసీదులో శుక్రవారం నిసార్‌అహ్మద్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. స్థానిక ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు మసీదులో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఆయన గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు అయినప్పటికీ, ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలుచేయలేదన్నారు. చంద్రబాబు పాలనపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జి.నవాజ్, మాజీ ఎంపీటీసీ రఫీ, మస్తాన్, మహబూబ్‌బాషా, సాదిక్, జాబీ, యూనస్, ఖీజ్రీ, యాసిన్, అబ్దుల్లా, ఇర్ఫాన్, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

చిట్వేలి: చిట్వేలి గాజుల వీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం సీతారామ, లక్ష్మణ ఆంజనేయ ధ్వజమూర్తుల విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు దోనెల రవీంద్ర, వెంకట కల్యాణి కుటుంబీకులు ఆలయానికి నాలుగు వెండి కిరీటాలు, శిఖర కలశం, ధ్వజ స్తంభం వితరణ చేశారు. ఆకేపాటి వెంకట రెడ్డి, ధన లక్ష్మీ కుటుంబసభ్యులు గంట, వెండి దీపాలను బహూకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి సీతారాముల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. ఉప సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డి, ముక్కావర లక్ష్మీ, కెకె.చౌదరి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

కాపాడమ్మా.. దండుమారెమ్మ



ప్రత్యేక అలంకరణలో దండుమారెమ్మ

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగులో వెలసిన దండుమారెమ్మ ఆలయంలో శుక్రవారం కన్నెమడుగు, మర్రిమాకులపల్లె, ఎద్దులవారిపల్లె గ్రామ పంచాయతీల్లోని గ్రామస్తుల సహకారంతో తిరునాల వైభవంగా నిర్వహించారు. దండుమారెమ్మ .. కాపాడమ్మా అంటూ భక్తులు మొక్కుకున్నారు. పూజారి శంకర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యుత్‌దీపాలతో అలంకరించి చాందీబండ్లు , పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో జరిగిన ఊరేగింపు భక్తులను అలంకరించాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తిరునాలకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న ఈఓ గురుమోహన్

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఈఓ గురుమోహన్ అన్నారు. నూతనంగా ఎన్నికైక గ్రామ పంచాయతీ కార్మికుల కమిటీ ఆధ్వర్యంలో పలువురు కార్మికులు ఈవోను కలసి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు రావాలసిన ఈపీఎఫ్ బకాయి ఐదు నెలలకు సంబంధించి జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులు వెంకటరామయ్య, అధ్యక్షులు బి.వి. ర మణ, ప్రధాన కార్యదర్శి ఓబులేసు, కోశాధికారి బి. నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పంచడమే క్రీస్తు సందేశం

- భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు
- ప్రత్యేక పార్థనలు చేసిన క్రైస్తవులు



కురబలకోట: గుడ్ ఫ్రైడే సందేశం ఇస్తున్న ఫాస్టర్ భూషణం



మదనపల్లె సిటీ: సందేశం వినిపిస్తున్న సంఘ కాపరి సునీల్ వరకుమార్

కురబలకోట: ప్రేమ పంచడమే క్రీస్తు సందేశమని జమ్ములమడుగు జహోవ రోహి చర్చి ఫాస్టర్ భూషణం పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గంలో క్రైస్తవులు, క్రీస్తు విశ్వాసులు భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు ఆచరించారు. మండలంలోని అంగళ్లు సీయోను ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన ముఖ్య అతిథిగా వాక్యోపదేశం గావిస్తూ మానవాళి రక్షణ కోసం ఏసు శిలువలో మరణించాడన్నారు. గుడ్ ఫ్రైడే, ఈస్టర్ క్రైస్తవ విశ్వాసానికి మూల స్తంభాలుగా నిలిచాయన్నారు. శిలువలో ఏసు పలికిన ఏడు మాటలు సంస్మరణీయమని పేర్కొన్నారు. మెర్సీ, జయరాజ్‌రెడ్డి, భాస్కర్, జాన్, తిమోతి, నాతానురెడ్డి, నెహెమ్యా, కోదండరెడ్డి పాల్గొన్నారు.

గుడ్‌ఫ్రైడే వేడుకలు

పెద్దతిప్పసముద్రం: గుడ్‌ఫ్రైడే పండుగ సందర్భంగా మండలంలోని కందుకూరు, పీటీఎం, కాటనగల్లు, పులికల్లు తదితర గ్రామాల్లోని చర్చిలు విశ్వాసులతో కిటకిటలాడాయి. ప్రపంచానికి శాంతి సందేశానిచ్చిన ఏసుక్రీస్తు బోధనలను పాస్టర్లు విశ్వాసులకు వివరించారు.

ప్రేమకు గుడ్‌ఫ్రైడే ప్రతీక

మదనపల్లె సిటీ: ఏసుక్రీస్తు తన జీవితాన్ని త్యాగం చేసి మానవ లోకానికి రక్షకుడిగా మారారని స్థానిక జేసీఎం చర్చి డివిజనల్ ఫాస్టర్ డాక్టర్ సునీల్ వరకుమార్ అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్దనున్న జెసీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏసుకు శిలువ వేసిన రోజునే పవిత్ర శుక్రవారంగా జరుపుకుంటామని తెలిపారు. చర్చి కార్యదర్శి భక్తవత్సలం, కోశాధికారి ఆనంద్, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షులు పాల్ చంద్రశేఖర్, వినోద్‌బాబుపాల్గొన్నారు.అలాగే బెంగళూరురోడ్డులోని ఆరోగ్యమాత చర్చి, సీఎస్ఐ పాఠశాలలోని చర్చి, కురవంకలోని చర్చి, ఆరోగ్యవరం, గుడిసివారిపల్లె చర్చిలలో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు.

ఏసు మరణం లోకానికి జీవం

పీలేరురూరల్ : ఏసు మరణం సర్వ లోకానికి జీవంగా మారిందని పాస్టర్ బి. జర్మీయా అన్నారు. శుక్రవారం స్థానిక తిరుపతి మార్గంలోని ఏసీఎల్ఎం చర్చిలో గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ ఏసు క్రీస్తు సర్వ జనులను ప్రేమించి వారి పాప ప్రాయశ్చిత్తం కొరకు సిలువ వేయపడ్డాడని చెప్పారు. అలాగే పట్టణంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



పీలేరురూరల్ : గుడ్‌ఫ్రైడే గురించి వివరిస్తున్న పాస్టర్ బి. జర్మీయా